క్లుప్తంగా

అనాథ శరణాలయాన్ని సందర్శించిన జడ్జి


పిల్లలతో మాట్లాడుతున్న జడ్జి భానుమతి

కొత్తగూడెంటౌన్: కొత్తగూడెం పట్టణ పరిధిలోని బూడిదగడ్డ బస్తీలోని శ్రీ స్నేహాలతా-సంధ్యాలత అనాథ శరణాలయాన్ని శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జడ్జి జి.భానుమతి సందర్శించారు. ఆశ్రమంలో పిల్లలకు అందుతున్న సదుపాయాలను నిర్వాహకుడు కొమరయ్యను అడిగి తెలుసుకున్నారు. పిల్లలకు సంరక్షణ విద్య, ఆహారం తదితర అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. శరణాలయం ఆవరణ, కిచెన్ రూం, స్టోర్ రూంలను పరిశీలించారు. పిల్లలకు చాక్లెట్స్, బిస్కెట్లు, అరటిపండ్లలను అందించారు. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ వి.పురుషోత్తమరావు, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.నిరంజన్ రావు, అసిస్టెంట్ కౌన్సిల్ జ్యోతి విశ్వకర్మ, నాగ స్రవంతి, సీనియర్ న్యాయవాది మెండురాజమల్లు తదితరులు పాల్గొన్నారు...

మజ్జిగ పంపిణీ


మజ్జిగ పంపిణీ చేస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ (టీఏడీయూ) పట్టణ కమిటీ ఆధ్వర్యంలో శనివారం వివిధ పాఠశాలల వద్ద విద్యార్థులకు, విధి నిర్వహణలో ఉన్న ట్రాఫిక్ పోలీస్ సిబ్బందికి మజ్జిగ పంపిణీ చేశారు. పట్టణాధ్యక్షుడు చింతపండు రాజ్‌కుమార్, ఆర్గనైజింగ్ కార్యదర్శి చింతపండు శ్రీకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ధర్మపురి నరేష్, ఉపాధ్యక్షుడు లకావత్ రమేష్, గిరి, మర్రి కృష్ణ, జిల్లా ప్రచార కార్యదర్శి చంటి, జిల్లా ఆర్గనైజర్ వెంకట్, ఉపాధ్యక్షుడు మాధవరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు..

సింగరేణి(కొత్తగూడెం): ప్రేమానురాగాలతో సమాజాన్ని నిర్మించుకుందామని జమాతే ఇస్లామిక్ హింద్ పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ బాషిత్ అన్నారు. శనివారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్ శాఖ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కుల, మతాల పేరుతో చిచ్చుపెట్టే స్వార్థపరుల ఆటలు సాగనివ్వమని, సమాజంలో శాంతి సామరస్యాలు వెల్లివిరిచేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనుదీప్, గూడెల్లి యాకయ్య, బావు సతీష్, వాసంపెల్లి వినయ్, తాపీ సంఘం నాయకులు ఆదామ్, శ్రీను, రామాలయ భజన కమిటీ సభ్యులు రామ్‌చందర్, సమ్మయ్య, ఓదేలు, జగన్, రంజీత్ తదితరులు పాల్గొన్నారు.

కవితల పోటీలకు ఆహ్వానం


పత్రికలను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

పాల్వంచ: శ్రీ క్రోధి ఉగాది పురస్కరించుకుని పాల్వంచ కళాపరిషత్, ఉగాది ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి కవిత పోటీకి కవులను ఆహ్వానిస్తున్నట్లు కళాపరిషత్ ప్రధాన కార్యదర్శి వేముల కొండలరావు తెలిపారు. శనివారం పాల్వంచలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రథమ బహుమతి రూ.3,116, ద్వితీయ బహుమతి రూ.2,116, తృతీయ బహుమతి రూ.1,516, రెండు ప్రోత్సాహక బహుమతులు ఇవ్వడం జరుగుతుందని, కవుల కవితలను 9849890322 నంబర్‌కు ఏప్రిల్ 5లోగా పంపించాలని కోరారు.

పాఠ్య పుస్తకాలు అందజేయాలి

కొత్తగూడెంఅర్బన్: తెలంగాణ రాష్ట్ర ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యనభ్యసిస్తున్న ఇంటర్మీడియట్ విద్యార్థులకు కొన్ని గ్రూప్‌ల వారికి పాఠ్య పుస్తకాలు అందక ఇబ్బందులు పడుతున్నారని వెంటనే వారికి పుస్తకాలు అందజేయాలని జిల్లా మైనార్టీ అధ్యక్షుడు ఎండి.యాకూబ్‌పాషా శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలు సమీపిస్తున్న ఉర్దూ మీడియం చదివే విద్యార్థులకు ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో పుస్తకాలు పంపిణీ చేయలేదని పేర్కొన్నారు.

చలువ నేస్తాలు వచ్చాయి..!

జ్యూస్‌లు, సీజనల్ పండ్లతో ఎండ నుంచి ఉపశమనం

- పుచ్చకాయలు, కొబ్బరిబొండాలు, తాటిముంజల అమ్మకాల జోరు
- రోడ్డుకు ఇరువైపులా జ్యూస్‌పాయింట్‌లు, పండ్ల షాపులు

సండే స్పెషల్


అమ్మకానికి తీసుకొచ్చిన పుచ్చకాయలు

కొత్తగూడెంటౌన్: ఎండలు మండిపోతున్నాయి.. బయటికి రావాలంటేనే జంకే పరిస్థితి ఉంది. అత్యవసర పనులపై వచ్చినా కాసేపటికే దాహార్తితో అలమటించాల్సివస్తోంది. దీంతో ఉపశమనం కోసం ప్రజలు జ్యూస్ పాయింట్లు పండ్ల షాపులను ఆశ్రయిస్తున్నారు. ఏటా మాదిరిగానే ఎండాకాలంలో రహదారుల వెంట పెద్దసంఖ్యలో కొబ్బరిబొండాలు, జ్యూస్ స్టాళ్లు ఏర్పాటయ్యాయి. జిల్లా కేంద్రంలోని కొత్తగూడెం, సూపర్‌బజార్, పాలకేంద్రం, హెడ్ ఆఫీస్, విద్యానగర్ కాలనీ, రుద్రంపూర్, శ్రీ ఇంక్‌లైన్, రామవరం ప్రాంతాల్లో రహదారులకు ఇరువైపుల చిన్న పందిళ్లు వేసి చిరు వ్యాపారులు, పండ్ల దుకాణాలు, జ్యూస్ పాయింట్‌లను ప్రారంభించారు. ఆటోలు, ట్రాలీల్లో పండ్లు తీసుకువచ్చి చెట్ల కింద, రోడ్డు పక్కన అమ్మకాలు చేస్తున్నారు.

చల్లచల్లని జ్యూస్..

ప్రస్తుతం జ్యూస్‌కు మంచి డిమాండ్ ఏర్పడింది. మామిడి, ఫైన్ ఆపిల్ జ్యూస్‌తో పాటు చెరుకు రసం, లస్సీ అమ్మకాలు బాగున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. ఇవేకాక మిక్స్‌డ్ జ్యూస్, ఆరంజ్ జ్యూస్, మజ్జిగ సైతం అమ్ముతున్నారు.

ఎండల్లో వ్యాపారం ఫుల్..

జోరుగా అమ్మకాలు..


కొబ్బరిబోండాలు..


తాటిముంజలు..

ఎండలు ముదురుతుండగా పండ్లు, జ్యూస్ అమ్మకాలు జోరందుకున్నాయి. కొత్తగూడెంలోని పలు ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులో ఆయా స్టాళ్లు ఏర్పాటయ్యాయి. తాటి ముంజలు డజన్ రూ.40 నుంచి 80 వరకు ధర పలుకుతుంది. అలాగే, పుచ్చకాయలు సైజును బట్టి కేజీ రూ.30 చొప్పున చిన్న సైజ్ పుచ్చకాయ రూ.40 నుంచి రూ.160 వరకు అమ్ముతున్నారు. కొబ్బరిబొండాలు ఒక్కొక్కటి రూ.30 నుంచి రూ.60 వరకు, కర్బూజా ఒకటి రూ.40 నుంచి రూ.80 పలుకుతుంది. అలాగే, ఫైనాపిల్ రూ.80 మొదలు రూ.160 అమ్ముతున్నారు.

ఎండాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఎండకాలం ప్రారంభం కాగానే చిరువ్యాపారులు ఇతర ప్రాంతాలు సీజనల్ పండ్లను తీసుకొచ్చి అమ్మకాలు చేస్తున్నారు. అన్ని ఖర్చులు పోను ఒక్కో వ్యాపారి తక్కువలో తక్కువ రూ.600 నుండి రూ.1,200 వరకు ఆదాయం పొందుతున్నట్లు చెబుతున్నారు. అయితే, ఎండలో ఉదయం నుంచి సాయంత్రం వరకు కష్టపడితేనే ఈ ఆదాయం వస్తోంది. కుటుంబ పోషణ కోసం ఎండను భరించక తప్పడం లేదని వారు చెబుతున్నారు.

జ్యూస్ అమ్మకం పెరిగింది..



జ్యూస్ అమ్మకాలు పెరిగాయి. వేసవితాపం నుండి ఉపశమనం కోసం ప్రజలు ఇక్కడికి వస్తుంటారు. రోజుకు ఖర్చులన్నీ పోను రూ.1,500 వరకు సంపాదిస్తున్నాను.

– బోడ చంటి, జ్యూస్ బండి యజమాని కొత్తగూడెం

పండ్ల అమ్మకం బాగుంది..



మా అమ్మ ఎండకాలం సీజన్ కావడంతో ఇక్కడ సీజనల్ పండ్లను అమ్మడం కోసం చిరు వ్యాపారం చేస్తుంది. నేను బీటెక్ పూర్తి చేశాను. సెలవులు కావడంతో మా అమ్మకు సాయంగా తోడుగా ఉంటున్నా. మా వద్ద పుచ్చకాయలు, ఆరంజ్, ఫైనాపిల్ అమ్మకాలు బాగున్నాయి.

– ప్రీతి, రుద్రంపూర్

వేడి తట్టుకోలేకపోతున్నాం..



మాది రుద్రంపూర్ నేను ఒక పని నిమిత్తం రుద్రంపూర్ నుండి కొత్తగూడెం సూపర్ బజార్‌కు వచ్చాను, ఎండవేడిమి భరించలేక దాహం వేస్తే చల్లదనం కోసం జ్యూస్‌ను తాగుతున్నాం.ఎండలకు వేడి తాపానికి చల్లని పండ్ల రసం తాగితే బాగుంటుంది.

– పిట్టల రాంచందర్, రుద్రంపూర్

డ్రాఫ్ట్ జీఓలను సవరించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: రాష్ట్ర ప్రభుత్వం కనీస వేతనాల జీవో డ్రాఫ్ట్ జీఓలను తక్షణమే సవరించి రూ.26 వేలు కనీస వేతన నిర్ణయించాలని కోరుతూ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా చేసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అబ్దుల్ నబి మాట్లాడుతూ.. జనవరి 29న రాష్ట్ర ప్రభుత్వం 75వ షెడ్యూల్ పరిశ్రమల్లో పని చేస్తున్న 1.20 కోట్ల మంది కార్మికులకు ఇచ్చిన కనీస వేతనం డ్రాఫ్ట్ పాత సీసాలో కొత్త సారాగా ఉందని విమర్శించారు. కార్మికుల నుంచి వచ్చిన అభ్యంతరాలను దృష్టిలో పెట్టుకొని తక్షణమే డ్రాఫ్ట్ జీఓలను మార్పు చేసి సుప్రీం కోర్టు తీర్పు, డాక్టర్ అక్రైడ్ ఫార్ములా ప్రకారం కనీసం వేతనం రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాళ్లూరి కృష్ణ, కామ నాగరాజు, ప్రేంసింగ్, లక్ష్మణ్‌పాసి, పవన్, భద్రు, వెంకన్న, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్‌కు పూజలు

పాల్వంచ: పట్టణంలోని కరకవాగు రోడ్డులో శ్రీ జగదాంబ దేవి ఆలయంలో బుడియా బాపూ సేవాలాల్ మహారాజ్ బోగ్ భండారో కార్యాక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త తేజావత్ రాములు మాట్లాడుతూ.. ఏప్రిల్ 6న జరిగే ఆలయ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని కోరారు. దేశా సాధు, నిరోశ, కిశోర్, మంజి, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్ సేవలు అభినందనీయం

సింగరేణి(కొత్తగూడెం): ఏఐటీయూసీ నాయకులు భూపతి శ్రీనివాస్ సేవలు అభినందనీయమని పీవీకె-5 ఇంక్‌లైన్ గని మేనేజర్ పాలడుగు శ్రీనివాస్ అనన్నారు. శనివారం కొత్తగూడెం ఏరియాలోని పీవీకె-5 ఇంక్‌లైన్ గనిలో సీనియర్ కార్మికుడు భూపతి శ్రీనివాస్ పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన్ని ఘనంగా సన్మానించారు. గని మేనేజర్ పాలడుగు శ్రీనివాస్, వీరస్వామి, మల్లీఖార్జున్‌రావు, రాములు, హుమాయిన్, కుమార్‌రావు, వీరయ్య, ఏఐటీయూసీ పిట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి


మాట్లాడుతున్న నాగరాజు

సింగరేణి(కొత్తగూడెం): తొమ్మిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, రీయంబర్స్‌మెంట్, బకాయిలు వెంటనే చెల్లించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు అన్నారు. శనివారం కొత్తగూడెంలోని మంచికంటి భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. తొమ్మిది నెలలుగా ప్రభుత్వం డైట్‌బిల్లులు ఇవ్వటం లేదని, బిల్లులు ఇవ్వకుండా సంక్షేమ వసతి గృహాలు ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. ఆర్థిక సంవత్సరం పూర్తి కావస్తున్నా బిలల్లులు చెల్లించకపోవటం పోవటం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు. విద్యా సంవత్సరం పూర్తి కావస్తున్న బిల్లులు చెల్లించకపోవటం బాధాకరమన్నారు.

ప్రతిష్ఠ మహోత్సవం


పూజలు చేస్తున్న నాయకులు

పాల్వంచ: పట్టణంలోని సంజయ్ నగర్‌లోని శ్రీ మహాలక్ష్మమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూజారులు పద్మనాభ శాస్త్రీ, మురళీ, పవన్‌ల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, విమలాదేవి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ నిర్వాహకులు కంచర్ల బాలకృష్ణ, చల్లా లక్ష్మీనారాయణ, సునీల్, జక్కుల వెంకటేశ్వర్లు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలను విరివిగా ఏర్పాటు చేయాలి

పాల్వంచ: వేసవి దృష్ట్యా స్వచ్ఛంద సంస్థలు విరివిగా చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. శనివారం పాత పాల్వంచ వీరభద్ర వాటర్ సర్వీసింగ్ సెంటర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వద్దిపర్తి వీరరాఘవాచారి, గంధమల్ల రాజయ్య, గుమ్మడివల్లి నర్సింహారావు, తిరుమల రమేశ్, కూరచంద్రం, నల్లమల్ల వేణు, రవి, రాము, మస్తాన్, చిరంజీవి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాల దరఖాస్తులు పునరుద్ధరించండి

పాల్వంచ: కేటీపీఎస్‌లో కారుణ్య నియామకాల దరఖాస్తులను పునరుద్ధరించాలని తెలంగాణా ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(హెచ్ 142) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెవి.రామారావు కోరారు. శనివారం కేటీపీఎస్ 5, 6, 7 దశల సీఈలు పి.వెంకటేశ్వరరావు, ఎం.ప్రభాకర్ రావులకు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలో దరఖాస్తు చేసుకున్న వారు మళ్లీ దరఖాస్తులు ఇస్తే స్వీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎస్.శ్రీనివాసాచారి, డి.సత్యరాజ్, వెంపటి వెంకటేశ్వర్లు, షేక్.సయ్యద్, ఎర్రగడ్డ ప్రసాద్, శివరాం, కె.శ్రీనివాస్, బి.బాలు, కె.వేణు తదితరులు పాల్గొన్నారు.

వితరణ..


టేకులపల్లి: దుస్తులు పంపిణీ..

సుజాతనగర్: మండలంలోని వేపలగడ్డ గ్రామంలో ఇండియన్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఫెలోషిప్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉమెన్స్ గిల్డ్ ఆధ్వర్యంలో అంతరాష్ట్ర వలస కూలీలకు శనివారం బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఎస్‌జీఎఫ్ జిల్లా అధ్యక్షుడు లోగాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాసీంల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ ఉమెన్స్ గిల్డ్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ నూరి మెహరున్నిసా, జిల్లా ముఖ్య సలహాదారులు, ఇందిరానగర్ కాలనీ ప్రభుత్వ స్కూల్ హెచ్‌ఎం జ్యోతిరాణి, ఉమా, అంజలి, జానకి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు దుస్తులు..

టేకులపల్లి: రంజాన్ పండుగను పురస్కరించుకొని బేతంపూడి దర్గా కమిటీ ఆధ్వర్యంలో వితరణ చేశారు. ఈ మేరకు శనివారం బేతంపూడి దర్గా కమిటీ ఆధ్వర్యంలో రంగు రాళ్లబోడు, వెంకట్యాతండా, బేతంపూడి, టేకులపల్లి గ్రామాలకు చెందిన నిరుపేదలకు దుస్తులు, నిత్యావసర సరుకులు అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో షఫీ, జానీ, జమాల్, ఖాజా, నదీమ్, అమీర్, హసీమ్, పాషా, మొయిన్, అమీన్, నర్సింహారావు, శ్రీను, వెంకన్న, లక్ష్మా పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలు తనిఖీ..


పోలింగ్ కేంద్రంలో తనిఖీ చేస్తున్న డీఎస్పీ చంద్రభాను, సిబ్బంది

ఇల్లెందు: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా రక్షణ చర్యల్లో భాగంగా పోలీసులు శనివారం పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్నారు. పోలింగ్ కేంద్రాలను పటిష్టపర్చేందుకు, తగిన సదుపాయాలు కల్పించేందుకు తనిఖీలు చేపట్టారు. ఇల్లెందు డీఎస్పీ ఎస్.చంద్రభాను, సీఐ టి.కరుణాకర్, ఎస్సై సందీప్ ఆధ్వర్యంలో 21 పిట్ హైస్కూల్, 24 ఏరియా స్కూల్, పూసపల్లి పాఠశాల, వీరాపురం, ముత్తారపు కట్ట, రొంపేడు పాఠశాలలను తనిఖీ చేశారు. పోలింగ్ కేంద్రాల్లో కరెంటు, మంచినీటి సదుపాయం, గేట్లు, మరుగు దొడ్లు పరిశీలించారు. గ్రామస్తులతో చర్చించి తగు సదుపాయాలు కల్పించేందుకు అంచనా రూపొందిస్తామన్నారు.

పారిశుద్ధ్య పనుల పర్యవేక్షణ


కాంట్రాక్టర్‌తో మాట్లాడుతున్న జీఎం

సాక్షి ఎఫెక్ట్..

సింగరేణి(కొత్తగూడెం): ఏరియాలో పారిశుద్ధ్యం పనులను పర్యవేక్షించి రిపోర్ట్ ఇవ్వాలని సింగరేణి డైరెక్టర్ పా ఎన్వీకే శ్రీనివాస్ ఆదేశాలివ్వటంతో శనివారం సంబంధిత కార్పొరేట్ జీఎం సివిల్ టి.సూర్యనారాయణ కొత్తగూడెం ఏరియాలో పారిశుద్ధ్యం పనులను పర్యవేక్షించారు. ఈ మేరకు సాక్షిలో శనివారం ప్రచురితమైన 'కార్మిక వాడల్లో పారిశుద్ధ్యం అధ్వాన్నం' అనే కథనానికి స్పందించిన అధికారులు ఆయా ప్రాంత కాంట్రాక్టర్‌ను పిలిచి మందలించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ... కంపెనీ కోట్ల రుపాయలతో టెండర్లు కట్టబెడితే నిర్లక్ష్యంగా వ్యవహరించటం సరికాదన్నారు. కాలనీలను పరిశుభ్రంగా ఉంచకపోతే శాఖపరమైన చర్యలు ఉంటాయన్నారు. జీఎం వెంట కార్పొరేట్ సివిల్ డీజీఎం సూర్యనారయణ, కొత్తగూడెం ఏరియా సివిల్ సిబ్బంది పాల్గొన్నారు.

సింగరేణిలో సెంట్రల్ సిలబస్ అమలుకు కృషి


మాట్లాడుతున్న వంగా వెంకట్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి పాఠశాలలో సెంట్రల్ సిలబస్ అమలుకు ఏఐటీయూసీ కృషి చేసిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) సెంట్రల్ కార్యదర్శి వంగా వెంకట్ అన్నారు. శనివారం కొత్తగూడెంలోని శేషగిరిభవన్‌లో జరిగిన యూనియన్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సింగరేణి యాజమాన్యంతో యూనియన్ నాయకులు మాట్లాడి సీబీఎస్ఈ అమలుకు కార్యరూపం చేపట్టిందన్నారు. సింగరేణి వ్యాపిత వివిధ విభాగాలు ఇందుకు సంబంధిచిన సమాచారాన్ని త్వరలో పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ రమణమూర్తి, ఎస్ రాము, రవీందర్, నితిన్ రామ్, శంకర్ పాల్గొన్నారు.

ఇల్లెందు: సింగరేణి పాఠశాలల్లో ఈ విద్యాసంవత్సరం నుంచి కొన్ని పాఠశాల్లో సీబీఎస్ఈ సిలబస్ అమలుకు యత్నాలు సాగుతున్నాయని ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధానకార్యదర్శి కె. సారయ్య, ఇల్లెందు ఏరియా బ్రాంచీ కార్యదర్శి నజీర్ అహ్మద్ అన్నారు. లక్షల రూపాయలు ప్రైవేట్ పాఠశాలలకు చెల్లించే బాధ కార్మికులకు తప్పి, మెరుగైన విద్యాబోధన సాగుతుందన్నారు.

అక్రమ ఇసుక రవాణా అరికట్టాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ములకలపల్లి మండలంలో అక్రమ ఇసుక రవాణా అరికట్టాలని కోరుతూ లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ కుశనాయక్ శనివారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. భారత రాజ్యాంగం కల్పించిన ఏజెన్సీ ప్రాంతంలో 5వ షెడ్యూల్ లోని ములకలపల్లి మండలం పరిధిలో ములకలపల్లి, తాళ్లపాయ, కొబ్బరిపాడు, మంగలిగుట్ట, పొగళ్లపల్లి, తిమ్మంపేట, పూసుగూడెం, ఆనందపురం, ముత్యాలంపాడు, జగన్నాథపురం, పీకే రామవరం ప్రాంతాలల్లో జోరుగా ఇసుక అక్రమరవాణా జరుగుతుందన్నారు. అక్రమ రవాణాను అరికట్టి లంబాడీలు, ఆదివాసీలకు ఇసుక క్వారీల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన జిల్లా ఉపాధ్యక్షుడు నాయక్, బీజేపీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి భుక్య రవి పాల్గొన్నారు.

ముగిసిన పదోతరగతి పరీక్షలు


పరీక్ష కేంద్రం నుంచి బయటకు వస్తున్న విద్యార్థులు

ఇల్లెందురూరల్: పదో తరగతి విద్యాశిఖరాలను అధిరోహించేందుకు తొలి మెట్టు వంటిది. ఆ మెట్టును విజయవంతంగా దాటేందుకు అడుగు పెట్టిన నాటి నుంచే విద్యార్థులు ఆటపాటలకు స్వస్తి పలికారు. శనివారం ఆఖరి పరీక్ష ముగియగానే పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు ఆనందోత్సహాల నడుమ గడిపారు. స్నేహితులతో కరచాలనం, సెల్ఫీలు, సెల్ నంబర్లు, అడ్రస్‌లు తీసుకుని మిత్రుల నుంచి వీడ్కోలు తీసుకున్నారు. పదో తరగతి పరీక్షలు రాసిన పలువురు విద్యార్థులు భవిష్యత్ చదువులపై వారి మనోగతం ఎలా ఉందో వారి మాటల్లోనే....

ఉన్నత స్థాయికి చేరడమే లక్ష్యం



ప్రణాళికాబద్ధంగా చదివాం. పరీక్షలు చక్కగా రాశాం. మంచి మార్కులు వస్తాయన్న నమ్మకముంది. ముమ్ముందు ఉన్నత చదువుల్లోనూ రాణించాలన్నదే నా ఆకాంక్ష. అందుకే పట్టుదలతో విద్యనభ్యసించి కన్నవారికి, గురువులకు పేరుప్రతిష్టలు తీసుకొచ్చేందుకు కృషి చేస్తా.

– పాయం హర్షిణి, బాలాజీనగర్, ఇల్లెందు మండలం

సాంకేతిక విద్యపై ఆసక్తి



పదోతరగతి పరీక్షలు ఎటువంటి ఇబ్బంది లేకుండా స్వేచ్ఛగా పూర్తి చేశాం. ఏడాదిపాటు చదివిన పాఠ్యాంశాలను జవాబుపత్రాలలో విజయవంతంగా రాశాం. మంచి మార్కులు వస్తాయన్న నమ్మకముంది. భవిష్యత్తులో సాంకేతిక విద్యలో ప్రవేశించాలన్నదే నా ఆకాంక్ష.

– నూనావత్ రూపశ్రీ, సీఎస్పీబస్తీ, ఇల్లెందు

ప్రణాళికాయుతంగా సన్నద్ధమయ్యా



పదో తరగతి పరీక్షలకు ముందు నుంచే ప్రణాళికాబద్దంగా సన్నద్ధమయ్యాను. వార్షిక పరీక్షలకు ఎటువంటి భయం లేకుండా హాజరయ్యాను. ప్రతి పరీక్షను చక్కగా రాశాను. మంచి మార్కులు వస్తాయన్న నమ్మకం ఉంది. ఉన్నత చదువులను విజయవంతంగా కొనసాగిస్తా..

– నీలారపు మాధురి, మొండితోగు,

ఇంజనీర్ అవ్వాలన్నదే కోరిక..



చిన్న వయస్సు నుంచే ఇంజనీర్ అవ్వాలన్నది నాకోరిక. అందుకు అనుగుణంగా ప్రతీ తరగతిలోను చక్కగా చదువుకున్నాను. పదో తరగతి ప్రారంభం నుంచే పాఠ్యాంశాలను ఏకాగ్రతతో చదివాను. పబ్లిక్ పరీక్షలో ఆశించిన గ్రేడింగ్ పాయింట్లు వస్తాయన్న నమ్మకం ఉంది.

– చీకుర్తి చరణ్, నెం.2బస్తీ, ఇల్లెందు